దశ

నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

శుక్రవారం

27 06 2025

సంపుటి 1 సంచిక 58

UDYAM / TS-09-0148996

మాదక ద్రవ్య రహిత తెలంగాణకు కృషి

ప్రభుత్వ సంకల్పానికి అందరూ సహకరించాలి

- ఒక్క మొక్క గంజాయి మెలిచినా ఈగల్ పట్టేస్తుంది
- డ్రగ్స్ నియంత్రణపై కార్యక్రమం లో సీఎం రేవంత్

దశ, హైదరాబాద్ : ఒకనాటి ఉద్యమాల గడ్డ తెలంగాణ మాదక ద్రవ్యాల మహమ్మారికి అడ్డాగా మారకూడదన్న లక్ష్యంతో ఇకనుంచి రాష్ట్రంలో ఒక మొక్క గంజాయి మెలిచినా ఇట్టే కనిపెట్టే "ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్మెంట్ " (ఈగల్) ను ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచంతో పోటీ పడే ఒక ఆరోగ్యకరమైన, మాదక ద్రవ్య రహిత తెలంగాణను నిర్మించుకోవడంలో ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

"అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం" పురస్కరించుకుని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో, తెలంగాణ వికలాంగులు, సీనియర్ సిటిజన్లు , లింగమార్పిడి వ్యక్తుల సాధికారత శాఖ సంయుక్తంగా శిల్పకళా వేదిక ప్రాంగణంలో డ్రగ్స్ నియంత్రణపై కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఒకనాడు ఉద్యమాలకు వేదికలైన కాలేజీలు, యూనివర్సిటీలు గంజాయి, మాదక ద్రవ్యాలకు వేదిక అయితే అది అందరికీ అవమానమన్నారు. యువకులు డ్రగ్స్ బారిన పడి బలవుతున్నారని, డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పాఠశాల, కాలేజీల్లో ఎక్కడైనా సరే దీనికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు. వీటి నియంత్రణకు యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే సంబంధిత యాజమాన్యాలపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

..మిగతా 2వ పేజీలో →

ప్రైవేటు బస్సు బోల్తా

- 30 మందికి గాయాలు

దశ, హైదరాబాద్: అమ్రాబాద్ మండలం దోమలపెంట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రైవేటు బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిని కర్నూలు జిల్లా సున్నిపెంట ఆస్పత్రికి తరలించారు. ఈ బస్సు జనగామ నుంచి శ్రీశైలం వెళ్తుండగా బ్రేకులు ఫెయిలై కొండను ఢీకొని బోల్తా పడింది.

పీజీ ఈ సెట్ ఫలితాల విడుదల

దశ, హైదరాబాద్: పీజీ ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, కన్వీనర్ అరుణకుమారి గురువారం జేఎన్టీయూలో విడుదల చేశారు. ఈ పరీక్ష కు 19 విభాగాలకు గాను 25,335 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 22,983 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు 21,290 మంది విద్యార్థులు (92.63 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

బోనాల ఉత్సవాలు షురూ

- తొలి బోనం సమర్పించిన మంత్రులు

దశ, హైదరాబాద్: ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు 2025 ప్రారంభోత్సవం సందర్భంగా లంగర్ హౌజ్ చౌరస్తాలో గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ,మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండా సురేఖ ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించి ,అమ్మవారికి తొలి బోనం సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..బోనాల పండగ సందర్భంగా మూడు వేల దేవాలయాలకు పండగ కోసం 20 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.. ఆ జగదాంబ మహంకాళి అమ్మవారి ఆశీర్వాదంతో ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో కళకళలాడాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు. .ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన ,సీపీ సివి ఆనంద్ ,కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్,ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

'లైవ్'లో శృంగారం... దంపతుల బరి తెగింపు

దశ, హైదరాబాద్: డబ్బుల సంపాదనకు ఓ జంట వికృత చేష్టలకు పాల్పడ్డారు. చివరకు టాస్క్ఫోర్స్కు చిక్కారు. అంబర్పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గతంలో రియల్ ఎస్టేట్ ఏజెంట్గా ఉన్న ఓ వ్యక్తి అది గిట్టుబాటు కాకపోవడంతో డబ్బుల సంపాదనకు భార్యతో కలిసి ఈ పాడుపనికి తెగబడ్డాడు. తమ ఇంటి ట్రెరస్పై భార్యతో సన్నిహితంగా ఉన్న వీడియోలను అప్లోడ్ చేయడం, రూ. 2 వేలు చెల్లించిన వారికి లైవ్స్ట్రీమింగ్ను ఏర్పాటు చేశాడు. నాలుగు నెలలుగా ప్రతిరోజు ఈ తరహా వీడియోలు పోస్ట్ చేస్తున్నాడు. ఈ వ్యవహారం ఆ నోటా ఈనోటా టాస్క్ఫోర్స్కు తెలియడంలో రైడ్ చేసి పట్టుకుని అంబర్పేట పోలీసులకు అప్పగించారు. . వీడియో కెమెరాతో పాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

తిరుమలగిరి ఆర్టీఏ ఆఫీస్ లో ఏసీబీ తనిఖీలు

దశ, హైదరాబాద్: తిరుమలగిరిలోని ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. ఈ కార్యాలయంలో వాహనాల లైసెన్సుల విషయంలో ఏజెంట్లు అక్రమ దందాకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో తనిఖీలు చేపట్టిన అధికారులు 18 మంది ఏజెంట్లను విచారించినట్టు తెలిసింది. వారి నుంచి కొన్ని పత్రాలు, మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

మానవత్వం మరిచారు.. సబ్బులకోసం ఎగబడ్డారు

దశ, మంచిర్యాల: ఇల్లు కాలి ఒకడు ఏడుస్తుంటే..చుట్టకు నిప్పు అంటించుకోవడానికి మరొకడు ప్రయత్నించాడంట..ఇలా ఉందీ ఘటన..మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపాలిటి పరిధిలోని ఇటిక్యాల సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరికొందరికి గాయాలయ్యాయి.. అయితే ఇందులో ఒక లారీలోసంతూరు సబ్బులలోడ్ ఉంది. ఇది గమనించిన స్థానికుల అందినకాడికి సబ్బులు పట్టుకెళ్లారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేయకపోవడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. పోలీసులు డ్రైవర్ మృతదేహాన్ని లక్సెట్టి పేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో భయపెడుతున్న రాకసి చేపలు

దశ హైదరాబాద్: రాకాసి చేపలు మత్స్యకారులను భయపెడుతున్నాయి. తాజాగా హైదరాబాద్లోని చర్లపల్లి చెరువు వద్ద మత్స్యకారులు వలలు వేసినప్పుడు టన్నుల కొద్దీ ఆర్మర్డ్ సెల్ఫిన్ క్యాట్ ఫిష్ అనే ఓ విచిత్రమైన చేపలు చిక్కుతున్నాయి. వీటిని డెవిల్ ఫిష్, లేక రాకాసి చేపలు అంటారు. చర్లపల్లి చెరువు వంటి నీటి వనరుల్లో ఈ డెవిల్ ఫిష్ అనూహ్యంగా పెరిగిపోతుండడం, ఇతర జీవజాతుల కోసం ముప్పు సంకేతం. మత్స్యశాఖ అధికారులు దీన్ని ప్రాణాంతకంగా పేర్కొంటున్నారు. ఇవి ఇతర చేపల గుడ్లను, పిల్లలను తినేస్తాయి.. ఒకసారి ఈ చేపలు చేరిన నీటిలో, ఏ చేపల విత్తనాలు వేసినా అవి బతకలేవు. ఈ డెవిల్ ఫిష్ వాటిని తినేసి స్వయంగా పెరిగిపోతాయి. దీనివల్ల మిగిలిన సంప్రదాయ చేపల జాతులు అంతరించి పోతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. వీటిని పట్టి బయటకు తీసి కాల్చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు

టూవీలర్లకు టోల్ ఫీజు..

- క్లారిటీ ఇచ్చిన నితిన్ గడ్కరీ

దశ, హైదరాబాద్ : జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు కూడా టోల్ ఫీజు వసూలు చేయాలని కేంద్రం నిర్ణయించిదంటూ వచ్చిన వార్తలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. జులై 15 నుంచే అమల్లోకి తీసుకురానున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టంచేశారు. టూవీలర్లకు టోల్ వసూలు చేసే ఉద్దేశమేదీ లేదని పేర్కొన్నారు. కొన్ని మీడియా సంస్థలు ద్విచక్ర వాహనాలపై టోల్ పన్ను విధించడం గురించి తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేస్తున్నాయని తప్పుబట్టారు. టోల్ పన్నుపై పూర్తి మినహాయింపు కొనసాగుతుందని చెప్పారు. వాస్తవాలు తెలీకుండా తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేయడం సరికాదని పేర్కొన్నారు. ఎన్హెచ్ఏఐ కూడా ఇదే తరహా ప్రకటన విడుదల చేసింది. టోల్ ఫీజు ప్రతిపాదనేదీ లేదని స్పష్టంచేసింది.

దశ
నిజం.. నిర్భయంగా..



చరిత్రలో ఈ రోజు

1838: వందేమాతర గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ జననం (మ.1894). (చిత్రంలో)
1880: అంధులకు, బధిరులకు, మూగవారికి వారధిగా, వికలాంగుల ఉద్యమాల సారథిగా ప్రపంచ స్థాయిలో పేరొందిన హెలెన్ కెల్లర్ జననం (మ.1968)
1939: ప్రజల నేత, హైకోర్టు న్యాయవాది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు. హేతువాది బొజ్జా తారకం జననం (మ.2016).
1967: ఇంగ్లాండు లోని ఎన్‌ఫీల్డ్ నగరంలో మొట్టమొదటి ఎ.టి.ఎం యంత్రాన్ని ప్రవేశపెట్టారు.
2008: సాహసోపేత భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా మరణం (జ.1914).
1978: సహకార రంగానికి ఎనలేని సేవచేసిన జవ్వాది లక్ష్మయ్యనాయుడు మరణం (జ.1901).
1980: తెలుగు రంగస్థల నటి సురభి ప్రభావతి జననం.
2009: న్యాయ శాస్త్ర కోవిదుడు, మాజీ లోక్‌సభ సభ్యుడు, రాష్ట్ర మంత్రి ఏరాసు అయ్యపురెడ్డి మరణం.

02
శుక్రవారం
27-6-2025
WWW.DASHANEWS.COM

ఇది కద జీవితం

ఇది కద జీవితం
అదొక స్వప్నంలొ గడపాలి
ఒక భక్తి సాధనతొ నడవాలి
పరిమళాలను వెదజల్యాలి
పరవశించి పోవాలి

ఉన్నన్ని రోజులు
అన్ని అనుభవించాలి
సంతోషంగా ఉండాలి
మనశాంతితొ బ్రతకాలి
మనుషుల మధ్య జీవించాలి

శారీరక శ్రమ ఉండాలి
మనసును అహలాదపరచాలి
సోమరితనం విడనాడాలి
స్వంత ఆలోచన ఉండాలి
స్వతహగ ఎదగాలి

ఇరుగు పొరుగు వారితో
స్నేహంగా మెదలాలి
బంధాలను పటిష్టపర్చుకోవాలి
పదిమందిని కలుపుకొనిపోవాలి
ఒంటరితనం విడనాడాలి

ఎగతాళి మాటలు
ఏడిపించే సంభాషనాలు
ఓర్వలేని గుణం
తప్పును ఒప్పుకోలేని నైజం
మనిషిని ఎదగనివ్వవు

వీలయితే సహాయం చేయాలి
బాధలలో తోడుగా నడవాలి
నిజం చెప్పాలి, దాన్ని నమ్మాలి
నిర్భయంగా మాట్లాడాలి
మోసపోకుండా ఉండాలి.

రచన:
కడెం. ధనంజయ, చిత్తలూర్

తెలంగాణ నుంచి డ్రగ్స్ తరిమికొట్టాలి

❖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

దశ, నల్గొండ: మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఎన్జీ కళాశాల వద్ద జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. తరువాత క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. తెలంగాణ కోసం 11 రోజులు ఇక్కడే నిరాహార దీక్ష చేశానని గుర్తు చేసుకున్నారు. కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం బాగా పెరిగిందన్నారు.. స్టూడెంట్స్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో డ్రగ్స్ అనేది ఉండకూడదన్నారు..వీటి నిర్మూలనకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. నల్గొండలో రూ. 34 కోట్ల వ్యయంతో స్కిల్సెంటర్ కట్టిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఏం కావాలన్నా ప్రతీక ఫౌండేషన్ ద్వారా, మంత్రిగా సహకారం అందిస్తానన్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, అడిషనల్ కలెక్టర్ జె .శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆదనపు ఎస్పీ రమేష్, డి డబ్ల్యుఓ కృష్ణవేణి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి.డీఈవో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

నవ మహిళా సాధికార కేంద్రంలో మహిళలకు చెక్కుల పంపిణీ

దశ, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన నవ మహిళా సాధికార కేంద్రంలో తాటి ఆకుల కళాకృతులు నవ లిమిటెడ్ సిబ్బంది యూనిఫామ్స్ కుట్టి విక్రయించడం ద్వారా రూ.2,59,690 వచ్చిన నగదును చెక్కు రూపంలో మేనేజింగ్ డైరెక్టర్ నిఖిల్ దేవినేని వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ఆపరేషన్ రేర్ అడ్మిరల్ శరత్ బాబు జనరల్ మేనేజర్ సి ఎస్ ఆర్ ఎంజిఎం ప్రసాద్ మహిళలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు పోతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవ లిమిటెడ్ అధికారులు సిబ్బంది శిక్షణ తీసుకుంటున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే ఎమ్మెల్యే దొంగ హామీలు

❖ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

దశ, ఎల్బీనగర్, : ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రజల ఓట్లు దండుకోవడానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దొంగ హామీలు ఇచ్చాడని, 118 జీవో పేరు మీద ప్రజల్ని మోసం చేసింది నిజం కాదా? అని అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ప్రశ్నించారు. గురువారం వనస్థలిపురం డివిజన్ లో వనస్థలి హిల్స్ కాలనీలో రూ, 80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ... వనస్థలిపురం డివిజన్ లో సమస్యలు పరిష్కారానికి ముఖ్యమంత్రి రూ, 18 కోట్లు మంజూరు చేశారన్నారు. హయత్ నగర్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైలు ప్రధాన స్టేషన్ గా ఎల్బీనగర్ చౌరస్తాను ఎంపిక చేసినట్టు తెలిపారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని చెప్పారు. హిల్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ పైన అదనపు అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హిల్స్ కాలనీ అధ్యక్షుడు మల్ రెడ్డి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు, నాయకులు గణేశ్ రెడ్డి, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి'

❖ పసుపు బోర్డు లోగో ఆవిష్కరించిన కిషన్‌రెడ్డి

దశ, హైదరాబాద్ : నిజామాబాద్లో పసుపు బోర్డు లోగోను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 29న పసుపు బోర్డు ఆఫీస్ ను హోం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారని తెలిపారు. పలు రాష్ట్రాలు కోరినా కేంద్రం నిజామాబాద్ కే బోర్డు కేటాయించిందని చెప్పారు. పోలీసులే ఫోన్ ట్యాపింగ్కు పాల్పడినందున ఆ కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసు సీబీఐకి సిఫార్సు చేయడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్తోకుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలన్నారు.

రైలు పట్టాలపై కారు.. రీల్స్ పిచ్చి

దశ, హైదరాబాద్: పిచ్చి పరాకాష్టకు చేరితే ఇలాగే ఉంటుంది. ఓ యువతి ఎక్కడా చోటు లేదన్నట్లు రైలు పట్టాలపై కారు నడిపింది. ఆమె నిర్వాకం వల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం తలెత్తింది. వికారాబాద్ జిల్లాలోని నాగులపల్లి, శంకర్ పల్లి మార్గంలో రైలు పట్టాలపై కారు నడుపుతూ యువతి హల్ చల్ చేసింది. దాదాపు ఏడు కిలోమీటర్ల మేర ఆమె కారు నడిపినట్లు సమచారం. రైలు పట్టాలపై యువతి కారు నడపటాన్ని గుర్తించిన కొందరు ఆమెను వారించారు. ఇలాంటి పిచ్చి పనులు చేస్తే ఆమె ప్రాణాలుతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆమెను అడ్డగించగా.. చాకుతో వారిని బెదిరించింది. ఆ తరువాత రైలు లోకో పైలట్ గమనించి చివరి నిమిషంలో రైలును ఆపారు. యువతిని స్థానికులు పట్టుకున్నారు. ఆమె చేసిన పిచ్చి పనుల వల్ల దాదాపు 2 గంటలపాటు ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు యువతిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. శంకర్ పల్లి పోలీసులు అక్కడికి చేరుకుని యువతిని అదుపులోకి తీసుకున్నారు. ఆమెను యూపీకి చెందిన సోనీగా గుర్తించారు. హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసేదని కానీ ఈ మధ్యే ఆమె జాబ్ పోయినట్టు పోలీసులు తేల్చారు. శంకర్ పల్లి నుంచి హైదరాబాద్ వైపుగా రైల్వే ట్రాక్ మీద ఆమె కారు నడిపిందని స్థానికులు చెబుతున్నారు. అయితే యువతి మానసిక పరిస్థితి సరిగ్గా ఉందా, లేక డ్రగ్స్ తీసుకుందా అని అనుమానిస్తున్నారు. పోలీసులు యువతి సోనిని వైద్య పరీక్షల కోసం చేవెళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళలు కోటీశ్వరులుగా మారాలి

❖ మహిళలు నైపుణ్యం పెంపొదించుకోవాలి
❖ త్వరలో మహిళలకి పెట్రోల్ బంక్ లు
❖ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

దశ, సూర్యాపేట : మహిళలు కోటేశ్వరులుగా మారాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకాక్షించారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో అలీప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మహిళలకి నిర్వహించిన శిక్షణ తరగతులులో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాంప్ (రైసింగ్ అండ్ ఆక్సిలీరేటింగ్ ఎమ్ ఎస్ ఎమ్ ఈ పెర్ఫార్మన్స్) అనేది ప్రపంచ నిధులతో ఎమ్ ఎస్ ఎమ్ ఈ ను బలోపేతం చేసే పథకం. ర్యాంప్ పథకంలో భాగంగా స్వయం సహాయక బృందాలును ఎమ్ ఎస్ ఎమ్ ఈ పరిధిలోకి తెచ్చి వారి అభ్యున్నతి సాధించాలనే సంకల్పం తో పని చేస్తుంది అని,దీనిలో భాగంగా మహిళలను వ్యాపారవేత్తలాగా మారెందుకు 15 రోజుల పరిశ్రమ నిర్వహణ, వ్యాపార ఉత్పత్తుల మార్కెటింగ్ మెలుకువలు, నైపుణ్యాభివృద్ధి కొరకూ శిక్షణ ఇవ్వటం జరుగుతుందని శిక్షణ అనంతరం ఎస్ హెచ్ జి మహిళల కోసం సొంతంగా వ్యాపారం చేయుటకి అవసరమైన సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో అలీప్ సెక్రటరీ పద్మజ కృపాకర్, డి ఆర్ డి ఏ పిడి వివి అప్పారావు, ఏపిడి సురేష్, లక్ష్మీనారాయణ, డి బి యమ్ లు, ఏ పి యమ్ లు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సద్దల చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దాలి

❖ రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

దశ, సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పాదనలు రూపొందించాలని రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సద్దల చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సద్దల చెరువు ప్రధాన ప్రవేశం వద్ద బతుకమ్మ ఘాట్, బోటింగ్, పిల్లలకి ఆడుకునేందుకు సామాగ్రి,అలాగే జాతీయ రహదారి వద్ద ఉన్న 5 ఎకరాల స్థలంలో ప్రజలకు వినోదం కల్గించేలా పార్క్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఏర్పాటు చేయాలనీ అధికారులకి సూచించారు. సద్దలచెరువు బండ్ పై మొక్కలకు పోషణ లేకపోవడం చూసిన చైర్మన్ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కమీషనర్ కు ఆదేశించారు. పిల్లలకు,పెద్దలకు అహ్లాద వాతవరణం కనిపించాలని, పిల్లలు ఇంటిని మరచిపోయేలా ట్యాంక్ బండ్ తీర్చిదిద్దాలని చైర్మన్ ఆధికారులకు తేలిపారు. ఈ కార్యక్రమం లో పర్యాటక శాఖ అధికారి విద్యాసాగర్,ఆర్డీవో వేణుమాధవ్,ఇరిగేషన్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

❖ ఎమ్మెల్యేను కలిసిన నర్సింహస్వామి కాలనీవాసులు

దశ, ఎల్బీనగర్: నాగోల్ డివిజన్ లోని నర్సింహస్వామి కాలనీలో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని స్థానికులు కోరారు. ఎమ్మెల్యేను గురువారం ఆయన కార్యాలయంలో నర్సింహస్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫేజ్ 1 అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాన సమస్యను వివరించారు. ప్రస్తుతం కాలనీలో ఇండ్లు పెరిగాయని, పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో కొత్త పైప్ లైన్ నిర్మించాలని కోరారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని, కొత్త ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు చేసి త్రీ ఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... అధికారులతో చర్చించి నూతన డ్రైన్స్ మంజూరు చేస్తానన్నారు. ప్రతి ఇంటికీ మంచినీరు, కరెంట్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, కాలనీ నాయకులు అశోక్ రెడ్డి, రామచంద్రం యాదవ్, అనిల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పాండురంగం, శివకుమార్, నరేందర్, వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత తెలంగాణకు కృషి

మొదటి పేజీ తరువాయి..

డ్రగ్స్ నియంత్రణపై పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలతో నార్కోటిక్స్ బ్యూరో ఒక సమావేశం నిర్వహించాలని సూచించారు. తెలంగాణను ఒక స్పోర్ట్స్ హబ్గా మార్చడానికి దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోని యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. భవిష్యత్తులో ఎవరైనా క్రీడల్లో శిక్షణ తీసుకోవాలంటే తెలంగాణకు వెళ్లాలనే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎంపీలు అనిల్ కుమార్ యాద్ , కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సినీనటులు రామ్ చరణ్ , విజయ్ దేవరకొండ , బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజు , హోం సెక్రెటరీ రవి గుప్తా , తెలంగాణ డీజీపీ జితేందర్ , తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా తో పాటు అధికారులు, యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం తోసహా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ మాదక ద్రవ్యాల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

❖ ఆదిత్య నగర్ కాలనీలో వందశాతం పూర్తయిన అభివృద్ధి పనులు

దశ, ఎల్బీనగర్ : మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని ఆదిత్య నగర్ కాలనీలో సుమారు రూ, 22 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఆదిత్య నగర్ కాలనీలో వంద శాతం అభివృద్ధి చేశామన్నారు. సీసీ రోడ్డును తొందరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి రోడ్డును నిర్మించాలని గుత్తేదారులకు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు పి.కృష్ణ, పి.రాజేందర్ ప్రసాద్, మురళీధర్ రెడ్డి, భిక్షపతి, రామ కృష్ణ, చంద్రశేఖర్, వెంకటేశ్, బలరామ్, డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.